సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 27 । మే । 2025



మత్తులో జీవితాలు చిత్తు

యువత మద్యానికి బానిసలుగా మారి అనారోగ్యం బారిన పడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. సరదాగా అలవాటు చేసుకుని బానిసలుగా మారుతున్నారు. 8లో



మస్తర్లలో మాయాజాలం

ఉపాధి హామీ పథకం నూజివీడు మండలంలో అక్రమాలకు నిలయంగా మారింది. అధికార పార్టీ నేతల అండదండలతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు అక్రమాలకు తెరతీశారు. 8లో



కోకో రైతుల పోరాటం ఆగదు

కోకో గింజలకు ప్రభుత్వం చెప్పిన ధర అమలు కావడం లేదని, మద్దతు ధర ఇచ్చే వరకూ కోకో రైతుల పోరాటం ఆగదని కోకో రైతుల సంఘం ముఖ్య నేతల సమావేశంలో తీర్మానించారు. 8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఈఏపీ సెట్



భీమవరంలో ఏపీ ఈఏపీ సెట్ పరీక్షకు హాజరైన విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

భీమవరం: ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష భీమవరం పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఎస్ఆర్‌కేఆర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం 179 మందికి 163 మంది హాజరుకాగా మధ్యాహ్నం 170 మందికి 165 మంది హాజరయ్యారు. విష్ణు ఉమెన్ కళాశాల కేంద్రంలో ఉదయం 87 మందికి ముగ్గురు, మధ్యాహ్నం 87 మందికి ఆరుగురు, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 110 మందికి 3, మధ్యాహ్నం 110 మందికి 3 విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఎన్నార్ అటానమస్ కళాశాలలో ఉదయం 100 మందికి 95 మంది, మధ్యాహ్నం 100 మందికి 100 మంది హాజరయ్యారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షాకేంద్రంలో ఉదయం102 మంది ఏడుగురు, మధ్యాహ్నం 101 మందికి ఏడుగురు గైర్హాజరయ్యారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం: పట్టణంలోని వాసవీ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు పూటలా పరీక్ష నిర్వహించగా 450 మందికి 438 మంది హాజరయ్యారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు 442 మందికి 430 మంది హాజరయ్యారు.

అమెరికాలో మెరిసిన గోదావరి అమ్మాయి



మిస్ తెలుగు యూఎస్ఏ-2025 పోటీలో రన్నరప్‌గా నిలిచిన చూర్నిక ప్రియ కొత్తపల్లి

వీరవాసరం: గోదావరి అమ్మాయి చూర్నిక ప్రియ కొత్తపల్లి, మిస్ తెలుగు యూఎస్ఏ 2025 పోటీలో రన్నరప్‌గా నిలిచింది. దీంతో ఆమె స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం రాయకుదురు శివారు నడపనవారి పాలెంలో ఆనందోత్సాహం నెలకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె పీపుల్స్ చాయిస్ అవార్డును కూడా గెలుచుకుంది. ఈ విజయానికి తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని కొత్తపల్లి భాస్కర్‌రావు సేవా ట్రస్ట్ అధినేత కొత్తపల్లి రాంబాబు తెలిపారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షకు 71 శాతం హాజరు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షకు 71 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. సోషల్ పరీక్షకు 2,329 మంది హాజరుకావాల్సివుండగా 666 మంది గైరహాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

ఏడాదైనా రోడ్డెక్కని ప్రగతి

- రోడ్ల అభివృద్ధికి చొరవ చూపని ప్రభుత్వం
- అరకొర మరమ్మతులతో సరి
- అధ్వానంగా తయారైన రోడ్లతో ప్రజలు అవస్థలు

పాలమూరు- నవుడూరు జంక్షన్ మధ్య 60 మీటర్ల మేర భారీ గోతులతో ప్రయాణికులు ప్రమాదాలు పాలవుతున్నారు. గత ప్రభుత్వంలో 500 మీటర్ల మేర సీసీ రోడ్డు, 500 మీటర్ల బీటీ రోడ్డు నిర్మించారు. 60 మీటర్లు మేర సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చెబుతున్నారు.



గోతులతో ప్రమాదభరితంగా నవుడూరు జంక్షన్ రోడ్డు

సాక్షి, భీమవరం: అధికారంలోకి రావడమే ఆలస్యం .. రోడ్లను అద్దంలా మారుస్తామంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు తర్వాత ఆ ఊసే మరిచారు. ప్యాచ్ వర్కులు, అత్యవసర పనుల పేరిట జిల్లాలోని స్టేట్ హైవే, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లలో తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. రూ.42.57 కోట్ల విలువైన 181 పనులకు బిల్లులు రాక 70 శాతం పనులు పూర్తికాలేదని అంచనా. నిర్ణీత ప్రమాణాలు పాటించకుండా చాలాచోట్ల నాసిరకంగా పనులు చేయడంతో గోతులు యథాస్థితికి చేరుతున్నాయి. కొన్ని చోట్ల గుంతల్లో కంకర, చిప్స్ వేసి తారు వేయకుండా వదిలేశారు. వాహనాల తాకిడికి రాళ్లు పైకిలేచి రోడ్డంతా చెల్లాచెదురై ప్రమాదభరితంగా తయారయ్యాయి. దీంతో ఈ రోడ్లు మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గతంలోనే రోడ్ల అభివృద్ధి

గత ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేయకపోవడంతో గుంతలమయంగా మారాయంటూ అప్పట్లో కూటమి నేతలు విషం చిమ్మారు. ప్రాధాన్య క్రమంలో రోడ్లను అభివృద్ధి చేస్తూ వచ్చిన విషయాన్ని కప్పిపుచ్చారు. చివరి ఏడాదిలోనూ గత ప్రభుత్వం సుమారు రూ.131.2 కోట్లతో 16 రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. వీటిలో అల్లంవారిలంక, కేపీపాలెం బీచ్ రోడ్డు, బియ్యపుతిప్ప- కేపీ పాలెం నార్త్, ఏలేటిపాడు బ్రిడ్జి అప్రోచ్, మార్టేరు- ప్రక్కిలంక రోడ్డు పనులు అప్పట్లోనే దాదాపు పూర్తయ్యాయి. మిగిలినవాటిలో కొత్తోట-దెయ్యాలతిప్ప, వెంప-కాళీపట్నం, కాళీపట్నం-జగన్నాథపురం, లక్ష్మణేశ్వరం-పెదమైనవానిలంక, తణుకు- వేల్పూరు, దువ్వ-ఆరుళ్ల, ఐతంపూడి-కొత్తపాడు, ఉరదాళ్లపాలెం-దువ్వ, కొమరవరం- ఈస్ట్ విప్పర్రు, సీతారాంపురం- పేరుపాలెం, నర్సాపురం- అశ్వారావుపేట రోడ్లు ఉన్నాయి. గత ప్రభుత్వం మంజూరుచేసి దాదాపు పూర్తిచేసిన రోడ్లను తామే చేసినట్టుగా చెప్పుకునే పనిలో కూటమి నేతలు ఉన్నారు.



కాళ్ల మండలంలో కోలనపల్లి నుంచి కుప్పనపుడి వరకు కొంతమేర మరమ్మతులు చేయక 2 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా ఉంది. గోతులు పడి వర్షపు నీటితో చెరువును తలపిస్తుంది. ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆకివీడు మండలం చెరుకుమిల్లి నుంచి ఏలూరుపాడు వరకు రోడ్డు ప్రమాదభరితంగా ఉంది.

భీమవరం-శృంగవృక్షం నుంచి వేండ్ర మీదుగా అటు కొండేపూడి ఇటు పాలకోడేరు వెళ్లే పైపుల చెరువు రోడ్డు అధ్వానంగా తయారైంది. విస్సాకోడేరు లాకుల నుంచి భీమవరం వరకు కిలోమీటరు మేర ఇటీవల నల్ల చిప్స్ వేసి వదిలేశారు. భీమవరం నుంచి వేండ్ర రైల్వే గేటు వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డు మీదుగా జిల్లా కేంద్రానికి రోజు వందలాది మంది ప్రయాణిస్తుంటారు.



అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): అర్జీలకు నిర్ణీత సమయంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేటు పీజీఆర్ఎస్ సమావేశం మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీలను జేసీ స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్ళి స్వయంగా పరిశీలించి పరిష్కారం చూపిస్తే ప్రజలకు నమ్మకం, అధికారులపై గౌరవం కలుగుతుందని అన్నారు. సోమవారం 192 అర్జీలు అందాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసీహెచ్ అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరస్పాండెంట్ లైంగిక వేధింపులు

- మీడియా ముందు వాపోయిన బీజీబీఎస్ కళాశాల లెక్చరర్
- కరస్పాండెంట్ శ్రీనివాస్‌పై పోలీసు కేసు నమోదు

నరసాపురం: నరసాపురంలోని బీజీబీఎస్ మహిళా కళాశాలలో లైంగిక వేధింపుల ఆరోపణలు కలకలం రేపాయి. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని కళాశాల పార్ట్‌టైమ్ లెక్చరర్, దివ్యాంగురాలైన వీరవల్లి గంగాలక్ష్మి ఆరోపించారు. 14 ఏళ్లుగా కాలేజీలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నానని, కాలేజీలో చేరినప్పటి నుంచి ఇబ్బంది పెట్టేవాడని కన్నీటిపర్యంతమైంది. లాడ్జికి రావాలని, సినిమాకు రావాలని ఒత్తిడి చేసేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. రూంకి పిలిచి అసభ్యంగా మాట్లాడేవారని వాపోయారు. కాదన్నందుకు ఓసారి ఉద్యోగం నుంచి తొలగించారని, అతని వేధింపులు బయటపెడతానని భయపడి తిరిగి తనను ఉద్యోగంలోకి తీసుకున్నారని చెప్పారు. ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో గత్యంతరం లేక మీడియా ముందుకు వచ్చానని వివరించారు. తనలా కళాశాలలో కొందరు విద్యార్థినులు కూడా ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మధుశాలిని, పార్ట్‌టైమ్ లెక్చరర్లు పి.ఝాన్సీ, కె.రజనీకుమారి మాట్లాడుతూ స్త్రీ పునర్వివాహాలు, మహిళల చదువుల కోసం పరితపించిన సర్విశెట్టి స్థాపించిన కళాశాలలో ఇలాంటి వ్యక్తులు చేస్తున్న అరాచకాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. గంగాలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీనివాసుపై కేసు నమోదు చేశారు.

'సాక్షి' కథనంతో ఒక్కొక్కటి వెలుగులోకి

'అమ్మకానికి మహాశయుడి ఆస్తులు' శీర్షికన మార్చి 30న సాక్షిలో ప్రచురితమైన కథనంతో కళాశాలలో జరుగుతున్న అక్రమాల వ్యవహారాలు ఒక్కోటిగా వెలుగులోకి వస్తున్నాయి. 'సాక్షి' కథనంతో స్పందించిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఇప్పటికే కళాశాల వ్యవహారాలపై నిరసనలు తెలిపారు. కళాశాల ఆస్తుల అక్రమ అమ్మకాలను అడ్డుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశాయి.

నేడు గోదావరి ఒడ్డున యోగాసనాలు

భీమవరం (ప్రకాశంచౌక్):/నరసాపురం యోగాంధ్ర 2025లో భాగంగా మే 27న నరసాపురం వశిష్ట గోదావరి ఒడ్డున ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జేసీ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువులు, యోగా శిక్షకులు, వలంటీర్లు, యోగాభ్యాసకులు, సాధారణ ప్రజలు పాల్గొనవచ్చన్నారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో థీమ్ ఆధారిత యోగా ప్రదర్శనలు, పోటీలు, సామూహిక యోగాభ్యాసం వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఐదు వారాల పాటు షెడ్యూల్ ప్రకారం వారంలో ఒక రోజు జిల్లాలో కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

మున్సిపల్ టీచర్లపై సవతి తల్లి ప్రేమ

ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకాక నష్టపోతున్న టీచర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల త్వరలో జరిగే బదిలీల్లో అర్హతలుండీ తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఒకే చోట పని చేస్తూ తమ సొంత ప్రాంతాలకు బదిలీ చేయించుకునే అవకాశాలు లేక అల్లాడుతున్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను విస్మరించిన పాఠశాల విద్యాశాఖ విధానాలపై నిరసన గళం వినిపిస్తున్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులను జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో సమానంగా పరిగణించాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం స్పష్టంగా నిర్ణయం తీసుకున్నప్పటికీ పాఠశాల విద్యాశాఖ చేస్తున్న చర్యలు, ప్రకటనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 2022లో మున్సిపల్ పాఠశాలల పరిపాలన, ఉపాధ్యాయుల సేవలను పాఠశాల విద్యాశాఖకు బదలాయిస్తూ జీఓ 84 విడుదల చేశారు. పాఠశాల విద్యా శాఖ ఉమ్మడి సర్వీస్ రూల్స్ ముసాయిదా తయారుచేసి, ఉపాధ్యాయ సంఘాల సూచనలు, న్యాయశాఖ, జీఏడీ అభిప్రాయాల ఆధారంగా చివరి రూపకల్పన చేయాల్సిఉండగా దానిని ఆమోదించకుండా పాత నియమావళిని కొనసాగిస్తోంది. ఎన్నో సంవత్సరాల నుంచి బదిలీలు లేక వేచి చూస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆశనిపాతంగా మారింది. మున్సిపల్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక ఉమ్మడి సర్వీస్ రూల్స్ వెంటనే ఆమోదించాలని, పదోన్నతులు, బదిలీలల్లో జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వ్యవహరించాలని, అన్ని నియామకాల్లో పారదర్శకత, న్యాయం పాటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్‌ను కూడా ఇతర మున్సిపాలిటీలో సమానంగా పరిగణించి, అర్హులైన వారికి ఏలూరు కార్పొరేషన్‌కు, ఏలూరు కార్పొరేషన్ నుంచి ఇతర మున్సిపాలిటీలకు బదిలీ చేయడానికి వీలుగా నిబంధనలు సడలించాలని డిమాండ్ చేస్తున్నారు.



ఉమ్మడి పశ్చిమలో 763 మంది మున్సిపల్ ఉపాధ్యాయులు..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మున్సిపల్ పాఠశాలల్లో ప్రస్తుతం 763 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని అన్ని నగరపాలక సంస్థ పాఠశాలల్లో అన్ని కేటగిరీల్లో కలిపి 417 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

జిల్లా యూనిట్‌గా ప్రమోషన్లు ఇవ్వాలి



మున్సిపల్ ఉపాధ్యాయుల ఎంపిక జిల్లా యూనిట్‌గా జరుగుతుంది. జిల్లా యూనిట్‌గా పదోన్నతులు, బదిలీలు జరగాలి. పదోన్నతుల అవకాశాల కోసం మున్సిపల్ ఎడ్యుకేషనల్ యూనిఫైడ్ సర్వీసు రూల్సు విడుదల చేయాలి. మున్సిపల్ ఏరియాలలోని ఇతర యాజమాన్యంలోని పాఠశాలలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో విలీనం చేయాలి.

– సోమరౌతు శ్రీనివాసరావు, ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

పదోన్నతులు కల్పించాలి



మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ప్లస్ -2 ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలి. డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలి. 1965 మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణ కోసం మున్సిపల్ స్కూళ్ల సూపర్‌వైజర్ పోస్టులను గ్రేడు 2 హెచ్ఎం స్థాయిలో మంజూరు చేసి పదోన్నతులు ఇవ్వాలి.

– పోలిమెట్ల సుమంత్, ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి

సర్పంచ్‌లపై 'రెడ్‌బుక్' వేధింపులు

- బిల్లులున్నా.. నిధుల దుర్వినియోగమంటూ చెక్ పవర్ రద్దు
- న్యాయపోరాటం చేస్తానంటున్న కామిరెడ్డి నాని



ఏలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని, చిత్రంలో పార్టీ నేతలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో కూటమి నేతల రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని.. తప్పుడు ఫిర్యాదులతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన సర్పంచ్‌లపై వేధింపులకు పాల్పడుతున్నారని శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని ఆవేదన వ్యక్తం చేశారు. తన చెక్‌పవర్ రద్దు చేస్తూ నోటీసులు జారీ చేశారని, దీనిపై వారం రోజుల్లో కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవాలని పంచాయతీ అధికారి చెప్పడం కూటమి నాయకులు రాజకీయ కుట్రలో భాగం అన్నారు. ఏలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తప్పుడు ఫిర్యాదులు చేయించి..

సమావేశంలో శ్రీరామవరం కామిరెడ్డి నాని మాట్లాడుతూ... పంచాయతీలో టీడీపీ మెంబర్లు వీఎస్‌వీ త్రినాథ్, ఆళ్ళ విజయలక్ష్మితో పాటు కొందరితో తప్పుడు ఫిర్యాదు చేయించారని, వాటిపై డీపీవో ఆధ్వర్యంలో 8 నెలల పాటు విచారణ చేయించారని తెలిపారు. విచారణలో ఒక్కరూపాయి దుర్వినియోగం కాలేదని, బిల్లులు ఉన్నాయని చెబుతూనే.. మరోవైపు వేధింపులకు పాల్పడడం దారుణం అన్నారు. 2021 డిసెంబర్‌లో రూ.20,875 నిధులు దుర్వినియోగం అయ్యాయని చూపిస్తున్నారని, కానీ ఈ నిధులకు సంబంధించి అధికారుల విచారణలో ఓచర్లు, ఎస్ఎంఆర్ ఉన్నాయని తెలిసినా.. రూ.17 వేలకు తీర్మానం లేదని, బిల్లులను ఏఈ సర్టిపై చేయలేదని, మిగిలిన రూ.4875కు బిల్లులు ఉన్నప్పటికీ స్టాక్ రిజిస్టర్‌లో నమోదు కాలేదని చెబుతున్నారని తెలిపారు. ఎల్ఈడీ లైట్ల కొనుగోలుకు రూ.1.31 లక్షల నిధులకు సైతం బిల్లులు, తీర్మానం ఉండగా స్టాక్ రిజిస్టర్‌లో లేవంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కామిరెడ్డి నాని చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాం

సర్పంచ్ విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోకుండా, సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేయటం దారుణమని ఎస్సీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. కామిరెడ్డి నానిపై వేధింపులు ఆపకపోతే.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ.. దెందులూరు నియోజకవర్గంలో అత్యవసర పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై చట్టపరంగా పోరాటం చేస్తామని తెలిపారు.

ఇవి రాజకీయ వేధింపులు కావా? : నాని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలో సాధారణ సమావేశం నిర్వహించలేదని, దీని ఆధారంగా ఎందుకు డిస్ క్వాలిఫై చేయకూడదంటూ డీపీవో నోటీస్ జారీ చేయటం రాజకీయ వేధింపులు కాదా ? అని నిలదీశారు. సమావేశం పెడితే అధికారపార్టీ నేతల కనుసన్నల్లో ఇతర ప్రాంతాలకు చెందిన రౌడీలు, అసాంఘిక శక్తులను సమావేశాలకు తీసుకువచ్చి గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించటం నిజం కాదా అన్నారు. పోలీస్ రక్షణ కావాలని అడిగితే మీ భద్రత బాధ్యత నాది కాదని డీపీవో చెప్పడం నిజం కాదా అన్నారు. దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన 7 మందికి పైగా సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు.

జగనన్న కాలనీకి నీటి సరఫరా



తాళ్లకోడులో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు

సాక్షి స్పందన

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో గత మూడు రోజులుగా ఆగిన కుళాయి నీటిని ఎట్టకేలకు సోమవారం వదిలారు. మూడు రోజులుగా కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో కాలనీలోని సుమారు 1000 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాలనీవాసుల నీటి ఇబ్బందులపై 'సాక్షి'లో కథనానికి జిల్లా, మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. నీటి ఇబ్బందిని కలెక్టర్‌కు తెలియజేయడంతో తక్షణం నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. దీంతో ఉదయం 10 గంటల ప్రాంతంలో కుళాయిలకు నీరు వదిలారు.

బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అద్నాన్ నయీం అస్మి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. అనంతరం కేసులకు సంబంధించిన ఆయా పోలీసుస్టేషన్ల అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ వాయిదా వేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 27 నుంచి తలపెట్టిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణను వాయిదా వేయాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు సమగ్రశిక్ష ఏలూరు జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.పంకజ్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలోని డీఆర్‌పీలకు ఓడరేవులో నిర్వహించే శిక్షణకు హాజరుకావాలని.. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన దరఖాస్తులు పెట్టుకునే పనిలో ఉన్న వారు ఈ శిక్షణకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి రాష్ట్ర ప్రాజెక్టు కోఆర్డినేటర్‌కు వివరించగా ఆయన స్పందిస్తూ వీలుపడిన వారు మాత్రమే హాజరు కావచ్చని, వీలుపడని వారు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారన్నారు. అయినప్పటికీ జిల్లాలో మండల విద్యాశాఖాధికారులు శిక్షణకు వెళ్ళాలని ఒత్తిడి తెస్తున్నారని, ఈ మేరకు ఎంఈఓలకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు.

శ్రీవారి దేవస్థానానికి ఏఈఓ బదిలీ

ద్వారకాతిరుమల: విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న మెట్టపల్లి దుర్గారావును మాతృ సంస్థ అయిన ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానానికి బదిలీ చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

ఆర్చరీ ప్రపంచ పోటీలకు సూర్యహంసిని ఎంపిక



పోటీలకు ఎంపికైన సూర్యహంసిని, పక్కన కోచ్ కమల్‌కిషోర్

భీమవరం: ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలకు భీమవరం పట్టణానికి చెందిన మదాల సూర్యహంసిని ఎంపికైనట్లు స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చేకూరి సత్యనారాయణ సోమవారం విలేకర్లకు వెల్లడించారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు పూణేలో నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో భీమవరం భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో ఇంటర్మీడియెట్ చదువుతున్న సూర్య హంసినితో పాటు మహారాష్ట్రకు చెందిన ప్రీతిక, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వెరెన్య రాణా ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు కంపండ్ బో గరల్స్ కేటగిరీలో భారత జట్టుకు ఎంపికయ్యారన్నారు. పోటీలు ఆగస్టు 17 నుంచి 8 రోజుల పాటు కెనడాలోని విన్నిపెగ్‌లో జరగనున్నాయని సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన సూర్యహంసిని, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, జయరాజు, కోచ్ కమల్ కిషోర్‌లను పలువురు అభినందించారు.

హెచ్‌ఎం ప్రమోషన్లకు 318 మందికి పిలుపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్ 2 హెడ్మాస్టర్‌ల ప్రమోషన్లకు అర్హత గల ఉపాధ్యాయులను 1:3 నిష్పత్తిలో ఖాళీగా ఉన్న 106 పోస్టుల కోసం 318 మంది ఉపాధ్యాయులను అర్హులుగా గుర్తించి వారి వివరాలను డీఈఓ ఏలూరు వెబ్‌సైట్‌లో ఉంచామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అర్హులైన ఉపాధ్యాయులు తమ సంబంధిత సర్వీస్ రిజిస్టర్, అర్హత గల విద్యార్హత ధ్రువపత్రాలు అన్నింటితో వారికి ప్రతిపాదించిన షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలని సూచించారు. ఏలూరులోని సిద్ధార్థ స్కూల్‌లో మంగళవారం ఉదయం నుంచి కౌన్సిలింగ్ ప్రారంభమౌతుందన్నారు. వివరాలకు సంబంధిత పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ముగిసిన దర్శనం

నేటినుంచి 11 నెలలపాటు విరామం



గోస్తనీలోని శ్రీరామలింగేశ్వరస్వామి

పెనుమంట్ర: నత్తారామేశ్వరంలో గోస్తనీనదిలో వేంచేసియున్న పరశురామ ప్రతిష్ఠ శ్రీరామలింగేశ్వర దర్శనానికి నేటినుంచి 11 నెలలు విరామం ఏర్పడనుంది. మంగళవారం నుంచి రామేశ్వరస్వామి కొలనులో నీరు నింపనుండటంతో ఇకపై స్వామివారి ఆలయ శిఖర దర్శనమే భక్తులకు దర్శనభాగ్యం కానుంది. ఏప్రిల్ 27వ తేదీన వైశాఖ మాసం ప్రారంభం కాగా అప్పటినుంచి నెలరోజుల పాటు స్వామివారు భక్తులకు నిజరూప దర్శనమిచ్చారు. ఆఖరి రోజున సోమవారం వరకు కూడా భక్తులు పెద్ద ఎత్తున భక్తులు బారులు దీరి స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం స్థానిక దాత కర్రి సుబ్బారెడ్డి అన్నదానం ఏర్పాటు చేయగా సుమారు 8 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామానికి చెందిన తమనంపూడి దుర్గారెడ్డి, ద్వారంపూడి సుబ్బారెడ్డిల సేవా కార్యక్రమాలతో ఆలయ కార్యనిర్వహణాధికారి పి వేణుగోపాలరావు ఉత్సవాలను పర్యవేక్షించారు.

మత్తులో జీవితాలు చిత్తు



మద్యం మత్తులో జోగుతున్న మందుబాబు



నిషా తలకెక్కి ఆ మత్తులోనే ఇలా..



మందొక్కటే జీవితం కాదురా..

ఏలూరు టౌన్: "పెదవేగి మండలం అంకన్నగూడేనికి చెందిన పల్లెపాముల శ్రీను(34), మద్యానికి బానిసగా మారాడు. ఎంతచెప్పినా కుటుంబాన్ని పట్టించుకోకపోవటంతో భార్య కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య, పిల్లలు లేకపోవటంతో శ్రీను ఒక్కడే ఇంట్లో ఉంటూ ఒంటరితనాన్ని భరించలేక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని ఇద్దరు పిల్లలు తండ్రిలేని అనాథలు మిగిలారు.''

"ఏలూరు మండలం జాలిపూడి గ్రామానికి చెందిన కటారి చిన నాగలక్ష్మి (21)కి చినకొండలు అనే వ్యక్తితో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. భర్త చిన కొండలు మద్యానికి బానిసగా మారాడు. కుటుంబాన్ని పట్టించుకోకపోవటంతో నాగలక్ష్మి తీవ్ర మనస్తాపంతో గడ్డిమందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె కుమారుడు ఏడాదిన్నర పసిపాప తల్లిలేని బిడ్డగా మారాడు.''

"ఏలూరు మండలం మాదేపల్లికి చెందిన వీ.వెంకటేశ్వరరావు (52) తాపీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. కానీ మద్యం అతిగా సేవించి అనారోగ్యం బారిన పడ్డాడు. ఒకరోజు ఇంటినుంచి వెళ్లిన అతను తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మరుసటి రోజు ఉదయం ఏలూరు వన్‌టౌన్‌లోని సత్యనారాయణ థియేటర్ ప్రాంతంలోని డ్రెయినేజీలో అతని మృతదేహం లభ్యమైంది. వెంకటేశ్వరరావు మృతితో ఆ కుటుంబం పోషణ వెంకటేశ్వరరావు భార్యకి కష్టంగా మారింది.''

"ఏలూరు చాణక్యపురి కాలనీ ప్రాంతంలో సాయి అనే వ్యక్తి రాత్రి సమయంలో సమీపంలోని బడ్డీకొట్టు వద్దకు వెళుతున్నాడు. ఇదే సమయంలో రూప్‌చంద్, అభిషేక్ అనే ఇద్దరు యువకులు అతడ్ని అడ్డుకుని మద్యానికి డబ్బులు కావాలని డిమాండ్ చేశారు. తనవద్ద లేవని సాయి చెప్పటంతో అతడ్ని సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి దాడి చేశారు.

- మద్యానికి బానిసలుగా మారుతున్న వైనం
- ఆత్మహత్యలు, కలహాలతో జీవితాలు ఛిద్రం
- కూటమి ప్రభుత్వానికి మద్యం ఆదాయంపైనే కన్ను
- మద్యం అలవాటును మాన్పించేందుకు గత జగన్ ప్రభుత్వం కృషి

అతని సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోవడంతో బాధితుడు పోలీసుసలను ఆశ్రయించాడు.''

మద్యానికి జీవితాలు చిత్తు

ఇదే తరహాలో నిత్యం అనేక మంది మద్యానికి బానిసలుగా మారుతూ అనారోగ్యం బారిన పడుతూ.. మానసిక సంఘర్షణలో జీవితాలను అర్ధాంతరంగా కోల్పోతూ తమ కుటుంబ సభ్యులను కష్టాల్లోకి నెట్టేస్తున్నారు. సరదాగా మద్యాన్ని అలవాటు చేసుకుంటోన్న యువత సైతం మెల్లగా మద్యానికి బానిసలుగా మారుతున్నారని మానసిక వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మద్యం మత్తులో భార్య, పిల్లల భవిష్యత్తును సైతం పట్టించుకోకుండా అంధకారంగా మార్చటం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ.. ఎప్పుడు బడితే అప్పుడు.. మద్యం నిత్యం అందుబాటులో ఉండడంతో ప్రజా జీవితాలు ఛిద్రం అవుతున్నాయని జనం అంటున్నారు. ఏలూరు జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌కు ఏడాదిన్నర కాలంలో 380 మందికి పైగా బాధితులు చికిత్సకు రావటం పరిస్థితికి అద్దం పడుతోంది.

వైఎస్సార్ సీపీ హయాంతో పోల్చితే...

వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం అలవాటును మాన్పించేందుకు ఎంతో కృషి చేసింది. మద్యం విక్రయాలపై వచ్చిన ఆదాయాన్ని సైతం సంక్షేమ పథకాలకు వెచ్చించింది. కానీ కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకువచ్చి మద్యం దుకాణాలను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తుండడంతో యువత మద్యం మత్తుకు బానిస అవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి భారీగా మద్యంపై ఆదాయం వస్తున్నా.. సంక్షేమ పథకాలు అమలు చేయకపోవటంపై ప్రజల్లో అసంతృప్తి పేరుకుపోయింది. ఎలాగో ఎన్నికల హామీలను అమలు చేయకుండా హ్యాండిచ్చిన సీఎం చంద్రబాబు... కూటమి ప్రభుత్వాన్ని నిలదీయకుండా ప్రజలను మద్యం మత్తులో జోగుతూ ఉండేలా చేశారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతోంది. యువత, ప్రజలు మద్యానికి బానిసలుగా మారుతూ కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నా.. కేవలం తమ రాజకీయ లబ్ధి కోసం మద్యాన్ని మరింత విచ్చలవిడిగా అందుబాటులో ఉంచుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

వైఎస్సార్ సీపీ, కూటమి ప్రభుత్వాల్లో మద్యం విక్రయాలు ఇలా

- కూటమి ప్రభుత్వంలో 2024 అక్టోబర్‌లో – 1,38,129 మద్యం కేసులు, 42,254 కేసుల బీర్లు విక్రయం
- వైఎస్సార్ సీపీ హయాంలో.. 2023 అక్టోబర్‌లో – 1,03,064 మద్యం కేసులు, 31,218 బీర్ల కేసుల విక్రయం
- కూటమి ప్రభుత్వంలో 2024 డిసెంబర్‌లో – 1,53,872 మద్యం కేసులు, 47,901 బీర్ల కేసుల విక్రయం
- వైఎస్సార్ సీపీ హయాంలో.. 2023 డిసెంబర్‌లో – 1,15,830 మద్యం కేసులు, 21,327 బీర్ల కేసుల విక్రయం
- కూటమి ప్రభుత్వంలో 2025 జనవరిలో – 1,53,866 మద్యం కేసులు, 66,325 బీర్ల కేసుల విక్రయం
- వైఎస్సార్ సీపీ హయాంలో 2024 జనవరిలో – 98,870 మద్యం కేసులు, 31,753 బీర్ల కేసుల విక్రయం
- కూటమి ప్రభుత్వంలో 2025 ఫిబ్రవరిలో – 1,36,345 మద్యం కేసులు, 64,891 బీర్ల కేసుల విక్రయం
- వైఎస్సార్ సీపీ హయాంలో 2024 ఫిబ్రవరిలో – 82,493 మద్యం కేసులు, 25,337 బీర్ల కేసుల విక్రయం
- కూటమి ప్రభుత్వంలో 2025 మార్చిలో – 1,47,958 మద్యం కేసులు, 85,173 బీర్ల కేసుల విక్రయం
- వైఎస్సార్ సీపీ హయాంలో 2024 మార్చిలో – 1,02,638 మద్యం కేసులు, 35,284 బీర్ల కేసుల విక్రయం

ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు



కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన మద్యం పాలసీతో ఏలూరు జిల్లాలో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ప్రైవేటు మద్యం దుకాణాలకు లబ్ధి చేకూరేలా నిత్యం మద్యం షాపులు తెరిచే ఉంచుతున్నారు. గతంలో కంటే అధికంగా మద్యాన్ని విక్రయిస్తూ ప్రభుత్వం వందల కోట్లు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. మద్యానికి జనం బానిసలుగా మారుతూ కుటుంబాలను సైతం పట్టించుకోని దుస్థితి ఏర్పడింది. మద్యం మత్తులో హత్యలు, ఆత్మహత్యలు, గొడవలు, ఘర్షణలు జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సంక్షేమ పథకాలు అమలు చేస్తారా ?



గత వైఎస్సార్ సీపీ పాలనలో ధరలు పెంచి మద్యం తాగే అలవాటును తగ్గించేందుకు ప్రయత్నిస్తే.. నేటి కూటమి ప్రభుత్వం ప్రజలను మద్యానికి బానిసలుగా చేస్తోంది. మద్యం విక్రయాలతో ఏలూరు జిల్లాలో ఏడు నెలల్లో రూ.700 కోట్లకు పైగా ఆదాయం వస్తే ... ఈ నిధులన్నీ ఏమి చేస్తున్నారు. పెన్షన్లు తప్ప ఒక్క సంక్షేమ పథకమైనా అమలు చేశారా ?. అదిగో ఇస్తాం..ఇదిగో ఇస్తామంటూ ఏడాది గడిపేశారు. ఒకవైపు డబ్బులు లేవని చెబుతున్నా.. ప్రభుత్వం వచ్చిన ఆదాయాన్ని ఏమి చేస్తుందో ప్రజలకు చెప్పాలి.

– మున్నుల జాన్‌గురునాథ్, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి

మస్టర్లలో మాయాజాలం

- 'ఉపాధిహామీ'లో అడుగడుగునా అక్రమాలు
- అధికార పార్టీ అండదండలతో అక్రమాలకు తెరలేపిన ఫీల్డ్ అసిస్టెంట్లు
- రెండు మస్టర్‌లకు ఒకే ఫొటోలోని మనుషులు
- ఏపీఓ, పీఓ, ఏపీడీల పర్యవేక్షణ శూన్యం



మస్టర్‌రోల్ నెంబరు 473కి అప్‌లోడ్ చేసిన ఫొటో ఇది



అదే కూలీలతో మస్టర్ రోల్ నెంబరు 474కి అప్‌లోడ్ చేసిన ఫొటో

నూజివీడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిర్వహణ మంత్రి నియోజకవర్గమైన నూజివీడు మండలంలో అడుగడుగునా అక్రమాలకు, అవినీతికి నిలయంగా మారింది. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు ఇష్టారాజ్యంగా అక్రమాలకు తెరతీశారు. ఫీల్డ్ ఛానల్స్, సప్లయ్ ఛానల్స్, పంటకాల్వలు, చెరువుల్లో పూడికతీత పనులు తదితర పనులను ఈ పథకంలో నిర్వహిస్తున్నారు. అయితే పనులు చేసేటప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని ప్రదేశంలో పనికి వచ్చిన కూలీల ఫొటోను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే ఇక్కడే అసలు మోసంకు పునాది పడుతోంది. ఎన్‌ఎంఎంఎస్‌లో అప్‌లోడ్ చేసే ఫొటోల్లో ఉన్న కూలీలు, పనికి హాజరైన కూలీలు వేరు వేరుగా ఉంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు ఒక పనికి హాజరైన కూలీలను ఒక ఫొటో తీసి, మరలా వారు నుంచొన్న స్థానాలను మార్చి రెండో ఫొటో తీసి రెండు పనులకు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇలా తీయడంతోనే ఫీల్డ్ అసిస్టెంట్‌లు అడ్డంగా బుక్ అవుతున్నారు. ఈ విధంగా మండలంలోని పల్లెర్లమూడి, జంగంగూడెం, బత్తులవారిగూడెం, హనుమంతలుగూడెం, మిట్టగూడెం తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మండలంలోని బత్తులవారిగూడెంకు చెందిన ఒక వ్యక్తి గ్రామంలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై నేరుగా ఉపాధిహామీ పథకం రాష్ట్ర సెక్రటరీకి ఫిర్యాదు చేయడంతో ఈ అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గ్రామంలోని సామాన్యులు అవినీతిని చూసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తుంటే స్థానికంగా పర్యవేక్షణను పకడ్బందీగా నిర్వహించాల్సిన స్థానిక అధికారులు మాత్రం కళ్లు మూసుకొని కూర్చోవడం గమనార్హం.

ఉపాధి నిధులు బొక్కేస్తున్నారని ఆరోపణలు

నూజివీడు మండలం బత్తులవారిగూడెం ఫీల్డ్ అసిస్టెంట్ అత్తి రవీంద్ర ఉపాధి పనుల్లో తీవ్ర అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నతాధికారులకు వెళ్లాయి. ఇతను అటవీశాఖకు సంబంధించిన నర్సరీలో బ్యాగ్‌లను మట్టితో నింపే పనులకు సంబంధించి మస్టర్ రోల్ నంబరు 473లో ఏ కూలీలను ఫొటో తీసి అప్‌లోడ్ చేశాడు. మస్టర్ రోల్ నెంబరు 474లో కూడా అదే కూలీలను అంతకు ముందు ఫొటోలో ఉన్న వారి స్థానాలను అటూ ఇటూ మార్చి మరో ఫొటో తీసి అప్‌లోడ్ చేశాడు. దీంతో ఉపాధిహామీ పథకం పనులను నిధులను బొక్కేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పనులకు అనుమతి లేకపోయినా..

ఎన్నెస్పీ కాలువల్లో ఉపాధిహామీ పథకంలో పనులు చేయడానికి అనుమతి లేకపోయినా బత్తులవారిగూడెంలో నూజివీడు మేజర్ కాలువలో పూడిక పేరుతో పనులు నిర్వహించారు. పూడిక తీసిన మట్టిని ఏమైనా కాలువ కట్టల బయట పోశారా అంటే అదీ చేయకుండా కాలువ లోపలిభాగంలోనే పోశారు. దీంతో వర్షాలు కురవడంతో మరలా ఆ మట్టంతా కాలువలో పూడికతీసిన ప్రాంతంలోకే వచ్చి చేరింది. ఈ రెండు పనులకు రూ.5.50లక్షలను చెల్లించారు. ఎన్నెస్పీ కాలువ అనేది పలు మండలాలు, పలు నియోజకవర్గాల పరిధిలో ఉంటుంది. ఏ గ్రామంలోని వారు ఎవరికి వారు వారిష్టం వచ్చినట్లు కాలువలో పనులు చేసేస్తే నీటి ప్రవాహాలు తేడా వచ్చి నీటిని విడుదల చేసినప్పుడు ప్రవాహ వేగం మారుతుంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరు వెళ్లే పరిస్థితి ఉండదు. ఈ పనులకు సంబంధించి అప్‌లోడ్ చేసిన ఫొటోలు సైతం మాయాజాలమే.

డ్వామా విజిలెన్స్ అధికారి విచారణ

ఒక వ్యక్తి రాష్ట్రస్థాయి అధికారికి ఫిర్యాదు చేయడంతో డ్వామా ఏలూరు జిల్లా విజిలెన్స్ అధికారి ఎన్ భోజి సోమవారం బత్తులవారిగూడెంలో విచారణ నిర్వహించారు. పనులకు వెళ్లిన కూలీలను అడిగి వివరాలు సేకరించారు. అలాగే పని జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. ఏపీడీ శ్రీదేవి, ఏపీఓ జీ మీనాక్షి పాల్గొన్నారు.

29 నుంచి వికసిత్ కృషి సంకల్ప అభియాన్

తాడేపల్లిగూడెం: పంట ఉత్పత్తుల పెంపు లక్ష్యంగా ఈ నెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పేరిట కేంద్రం సహకారంతో ఉమ్మడి జిల్లాలో కార్యక్రమం చేపట్టనున్నట్టు వెంకట్రామన్నగూడెం కేవీకే సమన్వయకర్త డాక్టర్ విజయ లక్ష్మి సోమవారం తెలిపారు. కేంద్ర వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యపశు సంవర్ధక అధికారులు బృందాలుగా గ్రామాలను ఉద్యాన, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వచ్చిన పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలో పెదవేగి ఆయిల్ ఫామ్ పరిశోధనా సంస్థ, కేవీకే శాస్త్రవేత్తలు మూడు బృందాలుగా రోజుకు మూడు గ్రామాల్లో 400 మంది రైతులకు మొత్తం 12వేల మందికి అవగాహన కల్పిస్తారు. తాడేపల్లిగూడెం, నల్లజర్ల, భీమడోలు, తణుకు, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోని రైతులకు 15 రోజుల పాటు రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తల మధ్య పరస్పర సంభాషణలు నిర్వహించనున్నామని ఆమె తెలిపారు.

ఖాళీ బిందెలతో ముట్టడి



ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించిన తాళ్లకోడు జగనన్న కాలనీ మహిళలు

ఆకివీడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని సోమవారం తాళ్లకోడు జగనన్న కాలనీవాసులు ముట్టడించారు. గత మూడు రోజులుగా తమకు మంచినీటి సరఫరా నిలుపుదల చేయడంపై ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. తక్షణం మంచినీరు సరఫరా చేయాలని, రేషన్ షాపు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. అనంతరం భీమవరం ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ బీవీ.వర్మ, కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో ఇటీవల పర్యటించిన గృహనిర్మాణ శాఖ, పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజెయ్ జైన్‌కు తమ సమస్యలు మొరపెట్టుకున్నామని, దీంతో తమపై కక్షగట్టి తమను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. అనంతరం ఆర్డీవో స్పందిస్తూ ప్రతీ రోజూ నగర పంచాయతీ నుంచి వాటర్ ట్యాంక్ కాలనీకు వస్తుందని చెప్పారు. వారానికి ఒక రోజు మునిసిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేస్తారని, రేషన్ షాపు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇతర సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని ఆర్డీఓ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, ఎస్.సూరిబాబు, బీ.రాంబాబు, డీ.రవితేజ, మహిళలు పాల్గొన్నారు.

మోటారుసైకిళ్ల చోరీ కేసులో నిందితుడికి రిమాండ్



చోరీకి గురైన మోటారుసైకిళ్లతో పోలీసులు

తాడేపల్లిగూడెం అర్బన్: గతంలో చోరీకి గురైన రెండు మోటారు సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ బోణం ఆదిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని శేషమహల్, ఎన్టీఆర్ చౌక్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి గస్తీ నిర్వహిస్తుండగా చోరీకి గురైన రెండు మోటార్‌సైకిళ్ల గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో నిందితుడు మెట్ట ఉప్పరగూడెం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ఏలూరు (మెట్రో): త్వరలో అమలు చేసే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయటానికి వారి ఖాతాలను ఎన్‌పీసీఐ విధానం కింద ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని ఏలూరు డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ ఎస్.శ్రీకర్ బాబు సోమవారం తెలిపారు. ప్రస్తుతానికి జిల్లాలో సుమారుగా 7 వేల మందికి బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం పూర్తికాలేదన్నారు. బ్యాంక్ ఖాతాలు లేని వారు కేవలం రూ.200తో పోస్టాఫీస్‌లో ఖాతా ఓపెన్ చేసుకుని ఆ ఖాతాకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. ఈమేరకు ఈనెల 31 నుంచి జూన్ 4 వరకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించడానికి పోస్టల్ శాఖ తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2628]

Wanted

■ Hyd చేవెళ్లలో కాలేజ్‌లో ఉంటూ పని చేయడానికి భార్యాభర్తలు కా॥. జీ: 20000 + వసతి. Ph: 8919737607/ 8328443702 [SCA25004025]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం: 18k. Ph: 9640258899, 9640468899 [HA-1909]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15904]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ధర వచ్చేవరకు కోకో రైతుల పోరాటం ఆగదు

- అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలి
- ఏపీ కోకో రైతు సంఘం డిమాండ్



సమావేశంలో పాల్గొన్న ఏపీ కోకో రైతుల సంఘం ముఖ్య నాయకులు

ఏలూరు (టూటౌన్): కోకో గింజలకు ప్రభుత్వం చెప్పిన ధర కిలోకు రూ.500 అమలు కావడం లేదని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. ఏలూరు అన్నే భవనంలో ఏపీ కోకో రైతుల సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన ధర అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.500 ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని కంపెనీలను, ట్రేడర్లను ఈనెల 23వ తేదీన ఏలూరు కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. కంపెనీలు, ట్రేడర్లు కిలో కోకో గింజలకు రూ.450 మాత్రమే ఇస్తామని చెప్పగా ప్రభుత్వం నుంచి రూ.50 చెల్లిస్తాము కిలో కోకో గింజలను రూ.500 కొనుగోలు చేయాలని రాష్ట్ర మంత్రులు చెప్పినా ఈ ధర ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కంపెనీలకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రైతుల నుంచి సక్రమంగా కోకో గింజలను కంపెనీలు, ట్రేడర్లు కొనుగోలు చేయడం లేదన్నారు. రైతుల వద్దనున్న మొత్తం కోకో గింజలు కొనుగోలు చేస్తామని చెప్పి మరలా కొద్ది కొద్దిగా కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను కూడా కంపెనీలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించకపోవడం వలన కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చేవరకు కోకో రైతుల పోరాటం కొనసాగుతుందని తెలియజేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ళ వెంకట సుబ్బారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆలపాటి శ్రీనివాసరావు, రాయల కాశీ బాబు, ఈడుపుగంటి శ్రీనివాసరావు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.



క్లుప్తంగా

యోగాంధ్రను విజయవంతం చేయాలి



పెంటపాడు డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పెంటపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన యోగాంధ్ర- 25ను విద్యార్థులు విజయవంతం చేయాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రతి నిత్యం కళాశాలలో జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా సోమవారం ప్రిన్సిపాల్ విద్యార్థులను, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా అభినందించారు. యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ విద్యార్థులు యోగా చేశారు. లెఫ్టినెంట్, ఎన్సీసీ కోఆర్డినేటర్ ఎం. విక్టర్ ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు జాన్‌బాబు పాల్గొన్నారు.

తణుకు విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాస్ మృతి



పాలమూరు శ్రీనివాస్

తణుకు అర్బన్: తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పాలమూరు శ్రీనివాస్ (55) సోమవారం కన్ను మూశారు. గత కొంతకాలంగా వివిధ అనారోగ్య సమస్యలతో విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లుగా ఆ శాఖ అధికారులు, సిబ్బంది తెలిపారు. ఆయనకు భార్య ధరణితో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈనెల 15వ తేదీన కుమార్తెకు వివాహం చేయగా, కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. శ్రీనివాస్ మృతి పట్ల విద్యుత్ శాఖ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గతేడాది సెప్టెంబరు నెలలో తణుకు విద్యుత్ శాఖకు బదిలీపై వచ్చారు.

సమస్యలపై 6 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, ఫిర్యాదుదారునికి పూర్తి స్థాయి న్యాయం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో ఆరు అర్జీలు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంలో నాలుగు, ప్రజారోగ్య విభాగంలో రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.


ఘనంగా సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



కొమ్మరలో సీతారామచంద్రస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని కొమ్మర గ్రామంలో సీతారామచంద్రస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు జరిపారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యప్రాశన, మంటప పునఃపూజ, గోపూజ, ధాన్యాధివాసం, చండీహోమం జరిపారు. సాయంత్రం ఉదయ శాంతి పారాయణ, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. గ్రామ పురోహితులు కొంపెల్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పలువురు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. అధిక సంఖ్యలో భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలందించాలి



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: కార్డుదారులకు డీలర్లు పారదర్శకంగా సేవలందించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ రేషన్ ఇచ్చే సమయంలో కార్డుదారులకు వీలైనంత త్వరితగతిన రేషన్ అందించి పంపించాలన్నారు. రేషన్ షాపుల వద్ద కార్డుదారులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రేషన్ పంపిణీలో డీలర్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కైలాసానికి దారి.. తణుకు జాతీయ రహదారి!

- గుంతలమయమైన దుస్థితి
- ప్రమాదకరంగా మారిన ఉండ్రాజవరం, తేతలి జంక్షన్ ప్రాంతాలు
- ప్రమాదాల్లో అసువులు బాస్తున్న వాహనదారులు
- అధ్వాన్నంగా ఉండ్రాజవరం జంక్షన్ సర్వీసు రోడ్లు



తణుకు ఉండ్రాజరవం జంక్షన్‌లో ప్రమాదకరంగా ఛిద్రమైన జాతీయరహదారి

తణుకు అర్బన్ : తణుకు ప్రాంత పరిధిలోని జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. తణుకు నియోజకవర్గ పరిధిలోని సుమారు 10 కిలోమీటర్ల పరిధిలోని తణుకు నుంచి తాడేపల్లిగూడెం, పెరవలి వైపు వెళ్లే మార్గాల్లోని జాతీయ రహదారిలో గుంతలు, ఛిద్రమైన ప్రాంతాల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. భారీ వాహనాలు సైతం ఈ గోతులను తప్పించే క్రమంలో ప్రమాదాల పాలవుతున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా జాతీయ రహదారి ఉండ్రాజవరం జంక్షన్ ప్రాంతంలో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పడిన గోతుల కారణంగా నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారుల్లో భారీ గుంతలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని కనీసం తాత్కాలిక మరమ్మతులకు కూడా నోచుకోవడంలేదని వాహనదారులు వాపోతున్నారు. ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నా ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవట్లేదని ఆరోపిస్తున్నారు.

ప్రాధాన్యతకలిగిన జాతీయరహదారి

చెన్నై టు కలకత్తాకు మార్గమైన తణుకు జాతీయ రహదారికి ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణాలు చేసే సౌకర్యం కలిగి ఉంది. ద్విచక్ర వాహనాలే కాకుండా ఆటోలు, కార్లు, బస్సులు, పది చక్రాల లారీల నుంచి 30 చక్రాల భారీ వాహనాలు సైతం ఈ రహదారి మీదుగా ప్రయాణాలు చేస్తున్నాయి. అయినప్పటికీ ఈ రహదారిపై సంబంధిత అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. టోల్‌లు వసూలుచేస్తున్నారే కానీ రహదారుల మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ ప్రయాణీకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తరచూ ప్రమాదాలే..

ఈనెల 10వ తేదీన స్థానిక ఉండ్రాజవరం జంక్షన్ ప్రాంతంలో ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి లారీ కింద పడి మృతి చెందాడు. ఈనెల 22న ఉండ్రాజవరం జంక్షన్‌లోని ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పడిన భారీ గోతుల్లో గూడ్సు ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకుంది. ఇలా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా కానీ ప్రమాదాల నివారణకు సంబంధించిన మరమ్మతులకు నోచుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తణుకు నుంచి పెరవలివైపు వెళ్లే జాతీయరహదారిలో ఏర్పడ్డ గుంతలు



తణుకు నుంచి పెరవలివైపు వెళ్లే జాతీయరహదారి ఛిద్రమైన దృశ్యం



తణుకు నుంచి తాడేపల్లిగూడెంవైపు వెళ్లే ఉండ్రాజవరం రోడ్డు జంక్షన్ జాతీయరహదారి దుస్థితి

ఆంజనేయస్వామికి విశేష పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో హోమం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హనుమద్ జయంతోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక శ్రీరామచంద్రరావు పేట లోని శ్రీకృష్ణ యోగధ్యాన మందిరంలో క్షేత్రపాలకుడు భక్తాంజనేయస్వామికి వేద పండితులు మర్ల సూర్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో శ్రీరామ, శ్రీ ఆంజనేయ హోమాలు ఘనంగా జరిగాయి. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

30న అలంపురంలో క్యాన్సర్ పరీక్షలు

పెంటపాడు: ఈనెల 30న అలంపురం వెంకటరమణ చారిటీ ఉచిత ఆసుపత్రిలో నోటి క్యాన్సర్ పరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 9 నుంచి 2 గంటల వరకు భీమవరంకు చెందిన విష్ణుడెంటల్ కళాశాల ప్రొఫెసర్‌లు డాక్టర్ బి. ఆనందబాబు, డాక్టర్ కేఎస్ చైతన్యరామ్‌లు పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వీయ పరీక్ష ద్వారా క్యాన్సర్ లక్షణాలు కనిపించవని, డాక్టర్ల పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమాన్ని నోటి సమస్యలతో ఇబ్బందులు పడే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జ్ఞాపకాల ఒడిలో.. ఆత్మీయ సమ్మేళనం



పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెంటపాడు: బాల్యంలో కలిసి చదువుకున్న స్నేహితులంతా పెంటపాడు బేసిక్‌స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. స్థానిక వాసవి సేవా కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో 2006-07లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని పాత జ్ఞాపకాలను నెమరవేసుకొని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారం తదితర రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వారి అనుభవాలను వివరించారు. ఈ అపూర్వ కలయిక ఎంతో ఆనందాన్నిచ్చిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. బాల్య స్నేహితులందరిని ఒక చోట కలుసుకోవడం ఆనందంగా ఉందని, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎప్పటికి మరిచిపోలేమని వారు తెలిపారు. అప్పటి ఉపాధ్యాయులైన సూర్యబాల, భాస్కరరావు, నాగేంద్రప్రసాద్, సత్యనారాయణ, మూర్తి, ఎంవీ రత్నకుమారి, లలిత, సుబ్రహ్మణం, రూప, శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్‌తోపాటు, పావని, దేవి, ఆశ, శ్రీలక్ష్మి, మానస సాయి దేవిక, దేవీ ప్రియాంక పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలి



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు



అత్తిలి శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పిస్తున్న రిసోర్సుపర్సన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయంలో పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని పుస్తక పఠనం గావించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో సోమవారం ఆసక్తికరంగా శిక్షణ తరగతులు జరిగాయి. విద్యార్థులు ఆట పాటలతో గడిపారు. రిసోర్స్‌పర్సన్లు ప్రత్తి వీరాస్వామి, ఎ.జనార్ధనరావు, కోపల్లె శ్రీనివాస్‌రావు, జి.బాపయ్యశర్మలచే కథలు, పుస్తకపఠనం, కాగితాలతో బొమ్మలు తయారుచేయడం, జాతీయ జెండా రంగులు, స్వాతంత్య్రం ఎలా వచ్చింది, నాల్గోవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ భారతదేశం తదితర అంశాలు గురించి చెప్పారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన

అత్తిలి: వేసవి శిక్షణలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ దర్శినిపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో గల వివిధ వనరులు, పరిశ్రమలు తదితర విషయాలపై రిటైర్డు గ్రంథపాలకుడు గంధం శేషవేంద్రరావు వివరించారు. ఉపాధ్యాయుడు డేవిడ్‌రాజు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, టి సత్యనారాయణ, ఎం సురేష్, వి లక్ష్మణరావు, ఎస్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు మూడు ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ఆకివీడు: పీజీఆర్ఎస్‌కు అధికారులు హాజరు కావాలని, క్రమ పద్ధతిలో అధికారులు ఫిర్యాదులను స్వీకరించి, అమలుకు చర్యలు చేపట్టాలని భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆయన హాజరయ్యారు. ఆయన సమక్షంలో మూడు ఫిర్యాదులు వచ్చాయి. గత కొంత కాలంగా వస్తున్న ఫిర్యాదులే పరిష్కారం కాకపోవడంతో మరలా తీసుకొచ్చారు. మండలంలోని రాజులపేటలో ఓల్డ్ వయ్యేరు పంట కాలువ నుంచి అక్రమంగా నీటిని చేపల చెరువులకు తోడుతున్నారని, రొయ్యల చెరువుల్లోని నీటిని పంట కాలువలోకి వదిలి వేస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన గొట్టుముక్కల వెంకట సూర్య సత్యనారాయణరాజు ఫిర్యాదు చేశారు. ఓల్డ్‌వయ్యేరుపై అనుమతులు లేని తూములు, వంతెనలను తొలగించాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మాదివాడలోని సర్వే నంబర్ 285-4బీలో 72 సెంట్ల భూమిని మండల సర్వేయర్‌తో సర్వే చేయించాలని ఎండీ నిజాముద్దీన్ బాబా ఫిర్యాదు చేశారు. మండలంలోని దుంపగడపలో మంచినీటి చెరువుకు ఆనుకొని ఉన్న రొయ్యల చెరువుకు అనుమతులు రద్దు చేయాలని, చెరువుల్లోని ఊట నీరు మంచినీటి చెరువులోకి వస్తుందని గ్రామానికి చెందిన సూరంపూడి రాంబాబు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు.

దళిత యువకులపై దాడి అమానుషం

భీమవరం: తెనాలిలో పట్టపగలు నడిరోడ్డుపై దళిత యువకులపై దాడి చేసిన సీఐలు రాములునాయక్, రమేష్‌బాబుపై సుప్రీం కోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ కోరారు. తెనాలి పట్టణంలో దళిత యువకులపై జరిగిన దాడి అమానుషమని పుష్పరాజ్ భీమవరంలో పేర్కొన్నారు. దళిత యువకులను పోలీసులు దారుణంగా బూతులు తిడుతూ కొట్టారన్నారు. ఈ సంఘటన చూస్తే చాలా బాధ కలిగిందన్నారు. దళితులే కదా ఎవరూ అడగరని పోలీసులు గూండాల్లా ప్రవర్తించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దళితులపై దాడులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు దాడికి పాల్పడిన పోలీసులపై కేసులు నమోదు చేసి, విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసులపై చట్టపర చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేయటానికి ఏమాత్రం వెనకాడబోమని తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కలిసిన మైనార్టీ ముస్లీం నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్‌సీపీ (మైనార్టీ) ముస్లిం నాయకులు మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సంఘం అధ్యక్షుడు నూర్ బాషా మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. చిత్తశుద్ధి లేని కూటమి నాయకులు రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను విమర్శించడం వారి అసమర్ధతను తేటతెల్లం చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి బాజీ మాట్లాడుతూ నూర్‌బాషాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏడాదికి రూ.100 కోట్లు మైనార్టీల అభివృద్ధికి ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఆదిశగా చర్యలు చేపట్టకపోవడంపై బాబు మోసగాడని తెలుస్తుందన్నారు. నూర్‌బాషాలకు రూ.5లక్షలు వడ్డీలేని రుణాలు ఇస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఇప్పటికి అమలు చేయకపోవడం చంద్రబాబునాయుడు అసమర్ధతను తెలియజేస్తుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుపై మాట్లాడకపోవడం చంద్రబాబునాయుడు మోసపూరిత రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు షేక్ హుస్సేన్ బీబీ, పశ్చిమ గోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ ఖతీజా, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి అక్బర్, నసీరుద్దీన్ నాగూర్‌మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను సమూలంగా తుదముట్టించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పాకిస్తాన్ కుట్రలు, కుతంత్రాలు మనలను ఏం చేయలేవని, ఉగ్రవాదులు ప్రపంచంలో ఏ మూల దాక్కున్నా వారిని తుదముట్టించాలన్నదే కేంద్రం సంకల్పమని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భీమవరం కొత్త బస్టాండ్ నుంచి పోలీస్ బొమ్మ సెంటర్ వరకు సోమవారం జయహో భారత్ ర్యాలీ నిర్వహించారు. స్నేహ, చైతన్య ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నంశెట్టి శ్రీనివాస్, కడలి హరిబాబు మాట్లాడుతూ ఆడబిడ్డల కుంకుమ చెరిపిన వాళ్ల భూమి మీద ఉండకూడదనే కేంద్రం ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిందని, ఉగ్రవాదంపై పోరాడుతున్న ఏకైక నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని, ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్‌కు జోహార్లు తెలుపుతూ నివాళులర్పించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అన్ని రంగాల వారితో పాటు కార్మికులు ప్రధాని మోడీకి అభినందనలు తెలుపుతూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, ఎం.సీతారామ్‌ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాలపై అవగాహన కల్పించాలి

భీమవరం: ఆచంట నియోజవర్గంలో ఇంటిగ్రేటెడ్ వసతి గృహాలు ప్రారంభించిన ప్రభుత్వం విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమైందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ విమర్శించారు. వసతి గృహాలను సక్రమంగా నిర్వహించాలని సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పుష్పరాజ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు అనేక మంది వసతి గృహాల మీద ఆధారపడి చదువుకుంటున్నారని వాటిల్లో సరియైన వసతులు లేక నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు వసతి గృహాల్లో ఉంటూ చదువుకునేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో వసతులు కల్పించి, అవసరమైన సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఊరేగింపు

భీమవరం అర్బన్: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా భీమవరం మండలంలోని దొంగపిండి గ్రామంలో శ్రీఆంజనేయ స్వామి వారిని సోమవారం ఘనంగా ఊరేగించారు. డప్పు, వాయిద్యాలతోనూ, బాణసంచాతోనూ గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమకాటు ఆరోగ్యానికి చేటు అని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలియజేస్తు బేబి సెంటర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం 9వ వార్డులో వెక్టర్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు, పరిశీలనలు, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన, ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి ఫ్రైడే, డ్రైడే నిర్వహించాలని కోరారు. దోమలను నివారించేందుకు కలిసికట్టుగా కృషి జరగాలన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమ తెరలు తప్పక వాడాలన్నారు. ఈ కార్యక్రమాలలో ఆరోగ్య కార్యకర్తలు వెంకట లక్ష్మి, సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ, ఆశాలు స్వాతి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ



పశుపోషకులకు దాణాను అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచడం కోసం పశు సంవర్ధకశాఖ ద్వారా సేవలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహ సంచాలకులు డాక్టర్ కె నరసింహారావు కోరారు. సోమవారం అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాలలో 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెండున్నర లీటర్‌పాలకి ఒక కేజీ పశు దాణాను ఇవ్వాలన్నారు. పశుదాణాలో 18 నుంచి 20 శాతం ప్రోటీన్ ఉండటం వల్ల పాల ఉత్పత్తి పెరగడమే కాకుండా వెన్నశాతం పెరుగుతుందని చెప్పారు. గేదెలు సకాలంలో ఎదకు వచ్చి చూడకడతాయని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, పశువుల ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కొనకళ్ల విజయనిర్మల కాంతారావు, జిల్లా జంతు సంక్షేమ డైరెక్టర్ ఆర్తి అజయ్‌కుమార్, స్థానిక నాయకులు దాసం ప్రసాద్, పి శ్రీనివాస్, నాగబాబు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ బోణం ఆది ప్రసాద్

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా తోపుడు బండ్లు ఏర్పాటు చేసి వాహనాలు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు కల్పిస్తున్న చిరువ్యాపారులతో పట్టణ సీఐ బోణం ఆది ప్రసాద్ చర్చించారు. సోమవారం సీఐ ఆది ప్రసాద్ పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలోని రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్న వ్యాపారులు తమ వ్యాపారాలను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచనలు చేశారు. నిబంధనలకు అతిక్రమించి నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో వాహనాలు, ప్రజలు రాకపోకలకు అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు బాదం శ్రీనివాస్, నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక అలంకరణ

భీమవరం(ప్రకాశంచౌక్): అమావాస్య సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి మల్లెపూలతో పూజ చేసి అలంకరణ చేశారు. సోమవారం పట్టణానికి చెందిన చిట్టూరి జగదీశ్, ఈశ్వర్, జక్కంశెట్టి రుత్విక్‌లచే ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకటన

ప.గో.జిల్లా, ఇరగవరం (మం), అయినపర్రు (గ్రా) ద్వారంపూడి సుబ్బిరెడ్డి అను నేను తెలియజేయు అఫిడవిట్ సంగతులు ఏమనగా

ఇటీవల అయినపర్రు లో సత్తి గురుమూర్తి రెడ్డి కుమారుడు రేబు కుమార్ రెడ్డి గారి భార్య కుమారి ఆను వారికి చెందిన ఆర్.ఎస్.నెం 167-1 లో 162 చ.గ. స్థలము & అందులో ఉన్న డోర్ నెం. 2-107 గల ఇంటిని నా కొనుగోలు చేయుటకు 10,00,000/- రూ. (పది లక్షలు) కు బేరం మాట్లాడుకుని అడ్వాన్స్ 4,00,000 (నాలుగు లక్షలు) ఇచ్చి మిగిలిన బ్యాలెన్స్ 6,00,000 లు త్వరలో ఇచ్చి రిజిస్టరు చేయించుకుంటాము. ఈ ఆస్తి పై ఎవరికైనా అభ్యంతరాలు లావాదేవీలు ఉన్న యెడల తెలియజేయగలరు. సంప్రదించగలరు.

ఇట్లు.. ద్వారంపూడి సుబ్బిరెడ్డి
సెల్ : 99666 93356